
# మైకు పిచ్చోళ్ళు
# అను గ్రాండ్ ఫంక్షన్ కథ

సర్వకళా సమితి సంస్థని స్థాపించి సంవత్సరం కావొస్తుంది. అందుచేత ఆ సంస్థ సభ్యులు సంస్థ వార్షికోత్సవాన్ని జరపాలని నిశ్చయించుకున్నారు. వార్షికోత్సవానికి ఇంకా రెండు వారాల టైముంది. ఫంక్షన్ ఎలా చెయ్యాలన్న విషయం గురించి మీటింగ్ పెట్టుకున్నారు సంస్థ సభ్యులు.




"మన సంస్థ వార్షికోత్సవాన్ని ఇంతవరకూ ఏ సంస్థా జరపనంత గ్రాండ్‌గా జరపాలి!..." అన్నాడు సెక్రట్రే చిదానందం.

"అవును... ఫంక్షనుకి వచ్చినోళ్ళు అద్దిరిపడాలి!" అన్నాడు ప్రెసిడెంటు అప్పారావు.

"అట్టాగైతే 'సౌండ్ అండ్ డబుల్ సౌండ్' అనే మైకుల కంపెనీ వాడు నాకు తెల్సు. వాడికి చెప్తే మాంచి మైకులు స్పీకర్లు ఓ డజనేసి తెస్తాడు...ఆ సౌండుకి జనాలు అదిరిపడ్తారు... ఏం, అట్టా చేద్దామా?" అన్నాడు ఒక మెంబరు.

"నీ మొహం మంటెట్టా... జనాల్ని అదరగొట్టడం అంటే సౌండుతో కాదు... మనం మంచి ప్రోగ్రాం ఇచ్చి అదర గొట్టాలన్న మాట!...

తెల్సిందా?" అన్నాడు చిదానందం.
"అట్టాగైతే నేను మద్రాసెళ్ళి సినీస్టార్... సూపర్ హీరోయిన్ స్టైప్వమాలిన్ని ఎట్టాగోలా బ్రతిమలాడి ఒప్పించి మన ఫంక్షన్‌కి తీస్కొస్తా... ఆ బాధ్యత నాది..." అన్నాడు ఇంకో మెంబరు.
అందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు.
"కార్యక్రమంలో ఒక మంచి నాటకాన్ని ఎన్నుకుని దాన్ని మన మెంబర్ల చేత వేయిస్తే బాగుంటుంది." మరో మెంబరు సజెస్ట్ చేశాడు.
దానికీ అందరూ అంగీకరించారు.
"జంబల కిడి పంజారే...
నీ అమ్మ అత్తారే
లపకజిం జిపక జిం పిల్లాదానా
నిన్ను ప్రేమిస్తే ఏమవుతావ్ బుల్లీదానా"
అంటూ హఠాత్తుగా లేచి గంతులేస్తూ ఒకమెంబరు సినిమా పాట పాడ్డం మొదలుబెట్టాడు.
చిదానందం, అప్పారావూ, మిగతా మెంబర్లూ కంగారుపడిపోయారు.
"ఏంటయ్యా ఇది?... హఠాత్తుగా నీకేమైంది?" అన్నాడు చిదానందం గంతులేస్తున్న మెంబర్ని పట్టి ఆపి.
ఆ మెంబరు సిగ్గుపడ్తూ చెప్పాడు "కార్యక్రమంలో నా పాటల ప్రోగ్రాం కూడా పెట్టిస్తారనీ..." గొణిగాడు.
"హోర్నీ... దానికింతగా గింజుకు సచ్చిపోవాలంటయ్యా?... అలాగే... అలాగే." అభయం ఇచ్చాడు సెక్రట్రీ చిదానందం.
"ఇంకా ఫంక్షనులో ఏయే కార్యక్రమాలు ఉండాలంటే..." ఆలోచిస్తూ అప్పారావు అంటుండగా వెనుకనుండి ఎవరో "మ్యా...వ్" అన్నారు.
మిగతా మెంబర్లంతా ఘొల్లున నవ్వారు.
"మీటింగ్‌లో ఇలా డిసిప్లిన్ లేకుండా ప్రవర్తిస్తే నేనూర్కోనంతే... ఇంతకీ పిల్లికూతలు అరిచెందెవరు?" మండిపడ్తూ అన్నాడు అప్పారావు.
"అది కాద్సార్... మరేమో నేను మిమిక్రీ చేస్తాను... ఆ రోజు కార్యక్రమంలో మీరు నాక్కూడా ఛాన్సిస్తారనీ..." బుర్ర గోక్కుంటూ మెల్లగా అన్నాడు వెనుకనుండి లేచి నిలబడ్తూ ఒక మెంబరు.
"అలాగే... అలాగే... మన మెంబర్లని మనమే ఎంకరేజ్ చెయ్యకపోతే ఇంకెవరు చేస్తారు?... నీ మిమిక్రీ ప్రోగ్రాం కూడా మన సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో పెడ్దాం" అన్నాడు సెక్రట్రీ.

ఆ మెంబరు సంతోషంతో భేషో అని మొరిగి కూర్చున్నాడు. అందరూ ఘొల్లున నవ్వారు.

ఇంకా ఆ కార్యక్రమంలో ఒక భరత నాట్యం ప్రోగ్రాం, ఓ కోయడాన్సూ కూడా పెట్టాలని నిర్ణయించారు.

మరి చీఫ్ గెస్టుగా ఎవరిని పిలవాలి అనే ఆలోచన వచ్చింది.

"మా బావగారు యమ్మెల్లే... ఆయన ద్వారా కల్చరల్ అఫైయిర్స్ మినిస్టర్ని మన ఫంక్షనుకి చీఫ్ గెస్టుగా రప్పిస్తాను" అన్నాడు ఒక మెంబరు.

అందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు.

"మంచి మంచి స్పీకర్స్‌ని కొంత మందిని పిలిస్తే బాగుంటుంది." ఒక మెంబరు సూచన చేశాడు.

ప్రెసిడెంటూ, సెక్రట్రీ, మిగతా మెంబర్లూ కలిసి స్పీకర్ల లిస్టు తయారుచేశారు. వాళ్ళలో ప్రసిద్ధ రచయిత రాకెట్ రాముడు, నవలా రచయిత్రి సిద్దమ్మ, ప్రఖ్యాత కూచిపూడి నర్తకి కుంటి మీనాక్షి, రంగస్థల నటుడు వీరావేశం తదితరులు ఉన్నారు.

తమ సంస్థ సర్వకళా సమితి ప్రథమ వార్షికోత్సవంలో ప్రసంగించడానికి పైన అనుకున్న స్పీకర్ల నందర్నీ కలిస్తే ప్రసంగించడానికి అందరూ ఒప్పుకున్నారు - ఒక్క రచయిత రాకెట్ రాముడు తప్ప.

"మీరు కవయిత్రి హింసశ్రీని కూడా పిలిస్తేనే నేనూ వస్తాను..." అని కండిషను పెట్టాడు రాకెట్ రాముడు.

"అలాగే... మా సభలకి ప్రముఖ రచయిత్రి హింసశ్రీ కూడా వస్తున్నారంటే అది మాకు ఆనందమే కదా?..." సంబరంగా అన్నారు చిదానందం, అప్పారావులు.

ఆ తర్వాత అక్కడి నుండి కవయిత్రి హింసశ్రీ దగ్గరికి వెళ్ళి విషయం చెప్తే ఆమె మెలికలు తిరుగుతూ సరేనంది.

సంస్థ కార్యకర్తలందరూ తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు.

మొత్తానికి తమది గ్రాండ్ ఫంక్షను కావడంలో సందేహం లేదు.

ఫంక్షను వీనుల విందుగా కనుల విందుగా ఉండడం కోసం వారు స్టేజిమీద ప్రదర్శించబోయే కార్యక్రమాల్ని రాత్రింబగళ్ళు నిద్రాహారాలు మాని రిహార్సల్సు చేశారు ఆ రెండు వారాలు. మొత్తానికి ఒక చక్కని కార్యక్రమం రూపొందించారు చిదానందం, అప్పారావులు.

అన్ని రోజుల నుండి ఎదురు చూస్తున్న దినం రానే వచ్చింది.

హాలంతా జనంతో కిటకిటలాడ్తుంది. అవును మరి... సినీ నటి స్టైప్వ
మాలిని కూడా వచ్చింది కదా!...
చీఫ్ గెస్ట్ కల్చరల్ అఫెయిర్స్ మినిస్టర్ మారయ్యతో సహా స్పీకర్లందరూ
వచ్చేశారు.
మొదట మీటింగ్, ఆ తర్వాత కల్చరల్ ప్రోగ్రాం!!
ఆరుగంటలకు మీటింగ్ మొదలయింది.
మొదట మినిస్టర్ మారయ్య మాట్లాడాడు.
"అయ్యా... అమ్మా... పిల్లలూ, పీచులూ నమస్కారం... మీరు నన్నీసభకి
చీఫ్ గెస్టుగా ఆహ్వానించడం నాకెంతో సంతోషంగా ఉంది... మీక్కూడా
సంతోషంగా ఉంటుందని నేను భావిస్తా ఉండాను... నేనీవాళ ఈ
పదవిలో ఉన్నానంటే కారణం మీరే... మీరు లేకుంటే నేను లేను..."
హాలంతా చప్పట్లతో మారుమోగిపోయింది.
"కానీ నేను బాగుండడం చూడలేక ప్రతిపక్షం పార్టీ వాళ్ళు చాలా
కూస్తున్నారు. అలా కూసేవాళ్ళని తంతే ఒకడు నెల్లూరులో, ఒకడు
అనంతపూర్లో, ఒకడు రాజమండ్రిలో పడ్తారు..." అలా ఆవేశంగా ఒక
అరగంట మాట్లాడి, "కాబట్టి నా ప్రజలారా... నేను చెప్పేదేమిటంటే -
చిన్నప్పుడు నేను వినాయక చవితి పందిళ్ళలో నాటకాలు వేస్తుంటే నేను
తెరలాగేపని చేసేవాడిని... కల్చరల్ ప్రోగ్రాంలంటే అంత ఇంటరెస్టు
ఉంది కనుకనే నేనీ సభకి వచ్చాను. ఇలాంటి కల్చరల్ అసోసియేషన్‌లు
ఇంకా చాలా రావాలని, ప్రముఖుల్ని సన్మానించడం వారి కార్యక్రమాల్లో
ఒక భాగంగా పెట్టుకోవాలనీ నేను కోరుతూ ఇంతటితో నా ప్రసంగం
ముగిస్తున్నా..."
హాల్లో అందరూ ఒక్కసారిగా తేలిగ్గా నిట్టూర్చి చప్పట్లు కొట్టారు.
ఇంతలో చిదానందం పరుగున వచ్చి మైకు పట్టుకుని "వచ్చేనెలలో
మా సంస్థ మినిస్టర్ మారయ్య గారిని ఘనంగా సత్కరించాలని
నిర్ణయించుకుంది..." అని అనౌన్స్ చేశాడు.
జనం ఎవరూ చప్పట్లు కొట్టలేదుగానీ మారయ్య మాత్రం సంతోషంగా
ఫటఫట చప్పట్లు కొట్టి, చుట్టూ చూసి నాలుక కరుచుకున్నాడు.
తర్వాత ప్రముఖ సినీనటి స్టైప్వమాలిని ప్రసంగించవలసిందిగా అధ్యక్షుడు
కోరాడు.
స్టైప్వమాలిని 'జజ్జనకడి... జజ్జనకడి... జజ్జనకడి...' అని గంతులేస్కుంటూ
మైకు దగ్గరకొచ్చి వయ్యారంగా నిలబడింది. జనం చప్పట్లు కొట్టారు.

"సభకి నమస్కారం."
ఒక బొంగురు కంఠం ప్రేక్షకులకి వినిపించింది. అందరూ కంగారుగా అటూ ఇటూ కలయజూశారు.
"ఏంటలా దిక్కులు చూస్తున్నారు?...ఇప్పుడు మీరు వింటున్న గొంతు నాదే..." బొంగురుగా బొలబొలా నవ్వుతూ అంది హీరోయిన్ స్టెప్పుమాలిని.
హాల్లోని అందరూ హాహాకారాలు చేశారు.
"నా గొంతు ఇలాఉంటుందికనుకనే సభల్లోసమావేశాల్లో మాట్లాడ్డానికి సిగ్గుపడ్డాను... నిర్మాతలు నాకు డబ్బింగ్ వాయిస్ పెడ్తారు... నాకు సభల్లో మాట్లాడే అలవాటు లేదు... అందుచేత నేనింక కూర్చుంటాను... నాకీ అవకాశం ఇచ్చిన సకల కళా సమితి కార్యకర్తలకి ధన్యవాదాలు" అని చెప్పి జజ్జనకడి జజ్జనకడి అని గెంతుకుంటూ తన ఆసనం దగ్గరికి వెళ్ళబోయింది స్టెప్పుమాలిని. కానీ అంతలోనే ఒక అభిమాని చేతిలో దండతో సుడిగాలిలా స్టేజిమీదికి వచ్చి ఆ దండని స్టెప్పుమాలిని మెడలో వేశాడు.
అంతే... వర్సగా ఆమె అభిమానులు ఆమెకి దండలు వేయసాగారు. ఆ దండల కార్యక్రమం ఒక పావుగంట సేపు సాగింది.
ఇంతలో ఒక అభిమానికి వీరావేశం వచ్చి మైకుని కౌగిలించుకుని స్పీచి ఇవ్వడం మొదలుబెట్టాడు.
"... ... మనమంతా ఇన్నాళ్ళూ తెరమీద ఆమె తొడలనీ, పొట్టనీ, నడుముని... ఇంకా పిక్కల్నీ... (సిగ్గుపడుత్తా) వాటిని మాత్రమే చూశాం. ఈనాడు ఆమె మొహాన్ని చూడగలిగినందుకు ఆమె అభిమానులమైన మనందరికీ ఎంతో ఆనందంగా ఉంది. ఇన్నాళ్ళూ ఆమె తొడల్తోనే నటిస్తుంటే మనమంతా చూసి ఆనందించాం... ఆమె మొహంతో కూడా నటిస్తే చూడాలని అభిమానులమైన మేమంతా ఉవ్విళ్ళూరుతున్నాం..."
అందరూ చప్పట్లు కొట్టారు.
తమ రాబోయే ఒక చిత్రంలో మొహంతోనే నటించినట్టు మైకులో అనౌన్స్ చేసింది స్టెప్పు మాలిని.
అందరూ మళ్ళీ చప్పట్లు కొట్టారు.
సినీ నటి స్టెప్పు మాలినికి మరి కొంత మంది అభిమానులు దండలు వేయడం మొదలు పెట్టారు... ఇది చూసి మినిస్టర్ మారయ్య చిన్నతనంగా ఫీలయి సెక్రటరీని పిల్చి అతని చెవిలో ఏదో ఊదాడు. దాని ఫలితంగా

నగరంలోని వివిధ సాంస్కృతిక సంస్థలవారు మినిస్టర్ మారయ్యకి వర్సగా దండలు వేసి ఆయన్ని పొగడ్తూ కొన్ని ఉపన్యాసాలు చేశారు.
అప్పటికే రాత్రి ఎనిమిది కావొస్తుంది. హాలు తొమ్మిది దాకానే బుక్ చేస్కున్నారు. మీటింగ్ గంటసేపు, కల్చర్ ప్రోగ్రాం రెండు గంటలసేపు, అని అనుకున్నారు. కానీ అప్పటికే రెండుగంటలు అయిపోయింది. గ్రీన్‌రూంలో మేకప్ వేస్కున్న కళాకారులు కొందరు గోడకేసి తలలు కొట్టుకుంటుంటే కొందరు జుట్టు పీక్కుంటున్నారు.
ఓ పది నిముషాల తర్వాత స్టైప్నమాలిని తనకి షూటింగుందంటూ సభ మధ్యలో లేచి వెళ్ళిపోయింది. ఆమెతోబాటు హాల్లోని సగం జనం లేచి వెళ్ళిపోయారు. మినిస్టర్ మారయ్య నాకేనా పనుల్లేనిది అన్నట్టు నిర్వాహకుల వంక చూసి "నేను ముఖ్యమంత్రిగారితో ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి" అని అతను కూడా వెళ్ళిపోయాడు. అతనితోబాటు ఇంకా కొందరు వెళ్ళిపోయారు. తర్వాత రచయిత రాకెట్ రాముడు నేటి సాహిత్యం తీరు తెన్నులు మీద అరగంట మాట్లాడి ఉన్నట్టుండి కవయిత్రి హంసశ్రీ గురించి పొగుడ్తూ మాట్లాడాడు. తర్వాత హంసశ్రీ రాకెట్ రాముడ్ని ఇంకా ఎక్కువగా పొగుడ్తూ, సిగ్గుపడ్తూ కులుకుతూ మాట్లాడింది. రచయిత్రి సిద్దమ్మ తనేదో నవల రాస్తే మెదడులోని ఒకటి రెండు నరాలు చిట్లిపోయాయని చెప్పి ఆ నవల గురించి అరగంట మాట్లాడింది. మిగతా స్పీకర్లు కూడా మాట్లాడి సభ పూర్తయ్యే సరికి రాత్రి పది గంటలైంది. హాల్లో రెండు డజన్ల ప్రేక్షకులు ఉన్నారు. వాళ్ళు కూడా కల్చరల్ ప్రోగ్రాంలో చేసేవారి తాలూకా మనుషులు. టైము అయిపోయిన కారణంగా మనుషులు లేని కారణంగా కల్చరల్ ప్రోగ్రాం కాన్సిల్ చేస్కున్నారు నిర్వాహకులు.
ఆతర్వాత తమ ఫంక్షన్నని గ్రాండ్‌గా చెయ్యాలని ఎప్పుడూ అనుకోలేదు సర్వకళా సమితి సంస్థ నిర్వాహకులు.

* * *